ప్రజాశక్తి
బుధవారం 18 సెప్టెంబర్ 2024
5
విజయనగరం



మృతదేహాన్ని కర్రకు కట్టి మోసుకెళ్లిన గిరిజనులు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని డికెపర్తి గిరిజన గ్రామంలో మంగళవారం అమానుష ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గేదెల రాజారావు అనారోగ్యంతో విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని చిలకలగెడ్డ వరకూ వాహనంలో తీసుకొచ్చిన గిరిజనులు అక్కడ నుంచి వాహనం వెళ్లే మార్గం లేక కర్రకు మృతదేహాన్ని కట్టి సుమారు 7 కిలోమీటర్లు మేర మోసుకొని గ్రామానికి చేర్చారు. తమ గ్రామానికి రహదారి లేకపోవడంతో ఎప్పటికప్పుడు ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారిని నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

126.52 కిలోమీటర్ల మేర..

దెబ్బతిన్న రహదారులు

- కొట్టుకుపోయిన తొమ్మిది కల్వర్టులు
- ఇదీ అర్అండ్‌బి వరద నష్టం
- పునర్మించాలంటే రూ.49.08కోట్లు అవసరం
- తక్షణ మరమ్మతులు చేయాలంటే రూ.1.42కోట్లు
- ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు



బొబ్బిలిలో దెబ్బతిన్న రహదారి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా పరిధిలో 29 రోడ్లలో 126.52 కిలోమీటర్ల మేర నష్టం జరిగింది. తొమ్మిది కల్వర్టులు కొట్టుకుపోయాయి. వీటి నష్టం రూ.49.08కోట్ల పైమాటేనట. తక్షణ మరమ్మతులు చేయాలన్నా రూ.1కోటి 42లక్షల 22వేల మేర నిధులు అవసరం కానుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ద్వారా ఆర్అండ్‌బి శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈనెల జూన్ 7వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు దఫదఫాలుగా భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా సెప్టెంబర్ మొదటివారంలో వరద ఏరులైపారింది. ఈనేపథ్యంలో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. ఈనేపథ్యంలో అధికారుల నివేదికలు ఒక్కసారి పరిశీలిస్తే జిల్లాలో అంతర్ జిల్లాల రహదారులు (మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్) 22 ఉండగా, 18రోడ్లు దెబ్బతిన్నాయి. అంతరాష్ట్ర రహదారులు (స్టేట్ హైవేలు) 12కిగాను 11రోడ్లు పాడయ్యాయి. మొత్తంగా 29రోడ్లలో 126.52 కిలోమీటర్ల మేర నష్టం జరిగినట్టుగా అధికారులు గుర్తించారు. ఇక రోడ్ల విషయానికి వస్తే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లలో కొత్తవలస – సబ్బవరం – కె.కోట పాడు రోడ్డు 8కిలోమీటర్ల మేర మరమ్మతులకు గురైంది. ఎన్‌హెచ్ 26వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకునివున్న మానాపురం – జక్కువ (వయా కొంపంగి – పోరాం) రహదారిలో 7కిలోమీటర్లు, కనిమెరక – దేవుపల్లి రహదారిలో 7కిలో మీటర్ల చొప్పున దెబ్బతింది. అలమండ – జమ్మాదేవిపేట రహదారిలో 5, అన్నమరాజుపేట – ఎం.కొత్తవలస రహదారిలో 3, అలమండ –పాంగ్రంగి రోడ్డులో 3, విజయనగరం – కొత్తవలస రోడ్డు నుంచి విజయనగరం – బౌడార వయా విఆర్ పాలెం, విఆర్ పాలెం, లక్కిడాం రహదారిలో 4, చీపురుపల్లి – లావేరు రోడ్డు నుంచి చినవడిపల్లి వయా ఇటికర్లపల్లి, జి.ములగాం రహదారిలో 4.90, చీపురుపల్లి – లావేరు రోడ్డు నుంచి కర్లాం వెళ్లే దారిలో 1.49, షికారుగంజి – కోడ్డు మధ్యలో 2, డొంకినవలస రైల్వే ఫీడర్ రోడ్డులో 1.40, పినపెంకి, ఆకులకట్ట, కోటిపల్లి, వాడాడ రోడ్డులో 3.25, 26వ నెంబర్ జాతీయ రహదారి నుంచి నరవ మీదగా ఒంపల్లి రహదారిలో 4, విబి రోడ్డు నుంచి అయ్యన్నపేట మీదుగా జొన్నవలస వెళ్లే రోడ్డులో 3, జిఎన్‌టి రోడ్డు నుంచి కంచేరు వరకు 4, కోనాడ నుంచి రెల్లివలస మీదుగా రామతీర్థం వరకు 3, కెఆర్ రోడ్డు నుంచి పూసపాటిరేగ వరకు 2, కెఆర్‌రోడ్డు నుంచి ముగినాపల్లి రహదారిలో 0.47 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి.

అంతర్ జిల్లాల రహదారుల్లో.... అత్యధికంగా గరివిడి – గర్భాం రహదారిలో 15.43కిలోమీటర్లు, బొబ్బిలి నుంచి రేజేరు మీదుగా తెర్లాం వెళ్లే రహదారిలో 15.40 కిలోమీటర్ల మేర మరమ్మత్తులకు గురైంది. గర్భాం – ఉత్తరాపల్లి దారిలో 12.10 కిలోమీటర్లు, చిలకలపాలెం – రామభద్ర పురం, రాయగడ రహదారిలో 4.20, విజయనగరం – పాలకొండ రోడ్డులో 4.82, విజయనగరం, కొత్తవలస వయా భీమసింగి రోడ్డులో 2, చింతపల్లి – విజయనగరం రోడ్డులో 1, విజయ నగరం – పాలకొండ (గరివిడి ఆర్ఓబి సర్వీస్‌రోడ్డు)లో 1.46, రాయ్‌పూర్ – విశాఖపట్నం (వయా రామభద్రపురం) రహదారిలో 0.60 కిలోమీటర్ల చొప్పున రహదారులు మరమ్మతులకు గురయ్యాయి. సెప్టెంబర్ మొదటి వారం కురిసిన భారీ వర్షాలు, నీటి ఉధృతికి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బి పరిధిలోని తొమ్మిది కల్వర్టులు కొట్టుకు పోయాయి. ఇందులో వేగావతి నదిపై పారాది కల్వర్టు ప్రధానమైనది. సుమారు రూ.కోటి వ్యయంతో ఆరు నెలల క్రితమే దీన్ని నిర్మించారు. బొబ్బిలి – తెర్లాం రహదారిలో మూడు కల్వర్టులు కొట్టుకుపోయాయి. దీని నష్టం సుమారు రూ.24లక్షలు ఉంటుంది. మరమ్మతులు చేపట్టాలంటే రూ.1.50లక్షల వరకు అవసరం కానుంది. గరివిడి – గర్భాం రోడ్డులు దెబ్బతిన్న కల్వర్టుకు శాశ్వత నిర్మాణానికి రూ.40లక్షలు అవసరమౌ తుందని అధికారులు అంచనా రూపొందించారు. మరమ్మతుకు రూ.5లక్షలు అవసరం. సాలూరు – మక్కువ దారిలో పాడైన కల్వర్టు విలువ రూ.6లక్షలు. దీని మరమ్మతులకు తక్షణం రూ.20 వేలు అవసరం. ఇలా మిగిలిన కల్వర్టులు మరమ్మతులకు లేదా శాశ్వత నిర్మాణాలకు కూడా నిధులు అవసరం కానుంది.

తిరుమల దర్శనానికి వెళ్లి వస్తూ..

లారీని కారు ఢీకొని ఇద్దరు దుర్మరణం



మృతిచెందిన మనోజ్‌కుమార్, శ్యామ్‌కుమార్ (ఫైల్)

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని మోదవలస వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. తిరుపతి దర్శనం కోసం వెళ్లి కారులో వస్తుండగా ఫ్రెస్‌ఛాయిస్ జంక్షన్ వద్ద ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..

విజయనగరంలోని ఇప్పిలివీధికి చెందిన నమ్మి మనోజ్ కుమార్ (30) కారు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన స్నేహితుడు విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం రాజుల తాళ్లవలసకు చెందిన అలమండ శ్యామ్ కుమార్ (31), మరో ఇద్దరు స్నేహితులతో కలిసి తన కారులో మూడు రోజుల క్రితం తిరుపతి వెళ్లారు. దర్శనం ముగించుకొని తిరిగి స్వగ్రామాలకు బయలుదేరారు. స్నేహితుల్లో ఒకరు ఏలూరులోను, ఇంకొకరు మధురవాడలోను దిగిపోయారు. మనోజ్ కుమార్, శ్యామ్‌కుమార్ కలిసి మంగళవారం తెల్లవారు జామున వస్తుండగా మోదవలస వద్ద ఆగిఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. దీంతో కారు లారీ కిందకు దూసుకుపోయింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చిన బయటకు తీశారు. మనోజ్ కుమార్‌కు ఏడాదిన్న క్రితం వివాహమైంది. భార్య శ్యామ్ కుమార్‌కు భార్య నిఖిల, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీ కిందకు దూసుకుపోయిన కారు

వారి కళ్లు సజీవం

విజయనగరం కోట : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆ యువకుల నేత్రాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు కెఆర్‌డి ప్రసాద్ స్పందించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానానికి ఒప్పించారు. రోడ్డు ప్రమాదంలో ఎన్.మనోజ్‌కుమార్, ఎ.శ్యామ్‌కుమార్ మరణించగా, వారి నుంచి మంగళవారం నాలుగు కార్నియాలను తీసి, విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ సందర్భంగా నేత్రదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కెఆర్‌డి ప్రసాద్ కోరారు. మృతుల కుటుంబాలను ఆయన అభినందించారు.

ఘనంగా విరాట్ విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

దైవిక వాస్తుశిల్పి, విరాట్ విశ్వకర్మ జయంతి వేడుక జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా జరిగింది. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా హాజరై, భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భగవాన్ విశ్వకర్మ విశ్వసృష్టికర్త అని పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యత ఉండబట్టే విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ పండుగగా రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. విశ్వకర్మ పేరుతో కేంద్రప్రభుత్వం విశ్వకర్మ యోజన ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేస్తామని అన్నారు. అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు విశ్వకర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, పనిముట్లతో, యంత్రాలతో వత్తులు నిర్వహించేవారు విశ్వకర్మకు ప్రధాన ఆరాధకులని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో పారిశ్రామిక రంగంలో ఎంతో ముఖ్యమని, ఈ రంగానికి ఈ కార్మికులే మూలాధారమని జెసి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.ఆచారి, కన్వీనర్ టేకు సత్యనారాయణ, డిఆర్ఓ ఎస్‌డి అనిత, జెడిఎ విటి రామారావు, సర్వే ఎడి త్రివిక్రమరావు, బిసి సహకార సొసైటీ ఇడి పెంటోజీరావు, డిబిసిడబ్ల్యూఒ యశోధనరావు, రాజులమ్మ, శ్యామలాకుమారి, వసతిగృహ సంక్షేమాధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థిని ఎంపిక

విజయనగరం టౌన్ : ఈనెల 13,14,15 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన పెద్ద నడిపల్లి హైస్కూల్ విద్యార్థిని కె.ఇందు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈమె ఈనెల 29 నుండి జమ్మూ కాశ్మీర్లో జరగబోయే జాతీయ పోటీలలో పాల్గొననుంది. ఆమె ఎంపిక పట్ల కార్యదర్శి ఎం.రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు అండర్ 14,17 ఫుట్‌బాల్ జట్లు ఎంపిక

విజయనగరం టౌన్ : అండర్ 14,17 ఫుట్‌బాల్ జట్ల ఎంపిక బుధవారం రాజీవ్ స్టేడియంలో జరుగుతుందని స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక కోసం వచ్చే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టడీ మరియు ఆధార్ సర్టిఫికెట్లు పట్టుకొని రావాలని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు తెలిపారు.

నాలుగో విడత ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం కోట : ప్రభుత్వ , ప్రైవేటు ఐటిఐలలో మిగిలి ఉన్న సీట్లకు నాల్గో విడత లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ట్అ.ఖజూ.స్త్రీజ.ఉఅ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థి నేరుగా ఈనెల 26లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత వచ్చిన యూనిక్ నెంబర్‌తో ఈనెల 27వ తేదీ సాయంత్రం 3గంటలలోపు ఐటిఐకి వెళ్లి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. 28న ప్రభుత్వ ఐటిఐల్లోను, 30న ప్రైవేటు ఐటిఐల్లోను ఉదయం 9గంటలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థి ఏ జిల్లాలో అయినా దరఖాస్తు చేసుకునేందుకు ఆప్షన్ ఉందని తెలిపారు. వివరాలకు ప్రభుత్వ ఐటిఐ 9849118075, 9849944654, 7780658035 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

సీతం కళాశాలకు సిఎస్‌సి గుర్తింపు

విజయనగరం : స్థానిక సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తికి కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటిసీస్ (సియస్‌సి) నుంచి ఉత్తమ ప్రిన్సిపాల్ గా పురస్కారం లభించింది. ఈ పురస్కారం ప్రతి ఏటా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, జన్మదినం సందర్భంగా అందిస్తారు. ఈ పురస్కారం లభించినందుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులు, యువత పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/కోట

గురజాడ గ్రంథాలయం ఆవరణలో మంగళవారం విశాలాంధ్ర బుక్ హౌస్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు, యువత పుస్తకాలకు దూరమై సోషల్ మీడియాకు దగ్గరైపోయారని అన్నారు. సోషల్ మీడియా విజ్ఞానం కంటే యువతని అజ్ఞానం వైపు, అశ్లీలం వైపు నడిపిస్తుందని తెలిపారు. అందుకే విద్యార్థులు యువతరం పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. బుక్‌హౌస్ జిల్లా మేనేజర్ సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ నాయకులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా గ్రంథాలయం కార్యదర్శి బి. లక్ష్మి గారు, తహశీల్దారు కూర్మనాథ్, సమాచార శాఖ ఎడి డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్

గురజాడ కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సందర్శించారు. గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడి అందుబాటులో వున్న పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాల లభ్యత తదితర అంశాలను తెలుసుకున్నారు. గ్రంథాలయ నిర్వహణకు వనరుల లభ్యతపై సంస్థ కార్యదర్శిని ఆరా తీశారు.

ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవ

- అయ్యకోనేరు చెరువు శుద్ధికి శ్రీకారం
- పరిశుభ్రత జీవితంలో దినచర్యగా మారాలి
- ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశ వ్యాప్త కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు ప్రజల భాగస్వామ్యంతో మంగళవారం జిల్లాలో అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రారంభమయ్యాయి. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరం మధ్యలో వున్న చారిత్రక అయ్యకోనేరు శుద్ధిచేసే కార్యక్రమంతో జిల్లాలో స్వచ్ఛతే సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె స్వయంగా చెరువు పరిసరాలను పరిశుభ్రంచేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని పలు స్వచ్ఛందసంస్థలు, విద్యార్థులు, అధికారులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిదులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో చెరువులో పూడుకుపోయిన వ్యర్థాల తొలగింపును చేపట్టారు. చెరువు గట్టు చుట్టూ ఐదువేల మంది విద్యార్థులు రెడ్ క్రాస్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరితో పర్యావరణాన్ని కాపాడతామని, వారంలో రెండు గంటలు, ఏడాదిలో వంద గంటలు పర్యావరణ పరిశుభ్రతకోసం తన సమయాన్ని కేటాయిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమం ప్రతి ఒక్కరికీ దైనందిన కార్యక్రమంగా మారాల్సి వుందన్నారు. మన భావితరాల వారికి స్వచ్ఛతను ఒక అలవాటుగా చేయాల్సి వుందన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మన జాతిపితను స్మరించుకోవడమే అవుతుందన్నారు. నగర మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల సహకారమే ముఖ్యమని చెప్పారు. అందరూ సహకరించి నపుడే పరిశుభ్ర నగరంగా విజయనగరం రూపొందు తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య మాట్లాడుతూ స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు అందించడం, వారికి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్ కేసలి అప్పారావు, డిఇఒ ప్రేమ్ కుమార్, మెప్మా పీడీ సుధాకర్, జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్ రాజా, డిఎస్‌డిఒ . వెంకటేశ్వరరావు, రెడ్ క్రాస్ అధ్యక్షులు ప్రసాదరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటిప్రకాష్, రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు ఆరిశెట్టి నాగేశ్వరరావు, రోటరీ ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ వెంకటేశ్వరరావు, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, నగర అధ్యక్షుడు ఇమంది సుధీర్, జనసేన ప్రతినిధి త్యాడ రామకష్ణారావు(బాలు) తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

జెఎన్‌టియులో స్వచ్ఛత కార్యక్రమం

జెఎన్‌టియులో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హే సేవా కార్యక్రమం జరిగింది. ఇంఛార్జి వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్లాస్టిక్ ఫ్రీ ఇండియాగా చేయడమేనని, ఇందులో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ ప్రోగ్రాంకు సంబంధించి అవగాహన కల్పించే విధంగా 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతోర్యాలీ నిర్వహించారు.

ఐసిడిఎస్ పనితీరు మెరుగుపడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, అనుబంధ విభాగాల పనితీరుపై కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డిసిపియు, శిశుగృహ, స్వధార, వన్‌స్టాప్ సెంటర్, లీగల్ సెల్ విభాగాల పనితీరు, సిబ్బంది విధులు, పెండింగ్ కేసులు, ఇతర అంశాలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సిబ్బంది పనితీరు మెరుగుపడాలని, నిర్లిప్తతను విడనాడాలని సూచించారు. ప్రగతి తక్కువగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీవిభాగం మరింత చైతన్యం కావాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రతీ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రస్తుతం 4.87శాతంగా ఉన్న అతి తీవ్ర పోషకాహార లోపాన్ని, రెండు నెలల్లో సున్నాకు తీసుకురావాలని ఆదేశించారు. యాచకవృత్తిలో ఉన్న 19 మంది బాలలను గుర్తించి తల్లితండ్రులకు అప్పగించామని, వారు ప్రస్తుత పరిస్తితిపై తనకు రెండు రోజుల్లో నివేదికను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, సిడిపిఒలు, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఊపిరితిత్తుల వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఊపిరితిత్తుల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ అవనాపు భాను ప్రకాష్ సూచించారు. మంగళవారం అంబటి సత్రం జంక్షన్ వద్ద గల భాను మల్టీ స్పెషాలిటీ చెస్ట్ కేర్ క్లినిక్ వద్ద కేన్సర్ ఉచిత పరీక్ష శిబిరం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన అవనాపు విజయ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ వల్ల పేద ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వారికి వైద్య సేవలు చేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఆస్మా తదితర రోగాలతో బాధపడుతున్న పేదవారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ సుధాకుమారి బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

రాజకీయ స్థిత ప్రజ్ఞుడు ఏచూరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకూ స్థిత ప్రజ్ఞతతో నిలబడ్డ నిజమైన రాజకీయ నాయకుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. సీతారాం ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని వ్యాఖ్యానించారు. గురజాడ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజలకు అండగా నిలబడ్డారని అన్నారు.కార్మిక హక్కుల రక్షణకు అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేసారు. కార్మిక–కర్షక పోరాటాల మార్గదర్శి అని సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీ లేని యుద్ధం చేసిన పోరాట యోధుడని అన్నారు. పదవుల చుట్టూ పరిభ్రమిస్తూ, అధికారమే పరమావధిగా మెడలోని కండువాలను మార్చేసే నేటి రాజకీయాలు కాలంలో ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతూ, సమసమాజం కోసం పరితపిస్తూ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలబడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ , గరజాడ నగర్ కార్యదర్శి రంభ శ్రీను, బి.శ్రీను, తది తరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న కలెక్టర్, డిఎంహెచ్ఒ,డిఇఒ

ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-జామి

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యపై ఏకాగ్రత కలుగుతుందని, చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. పిల్లలు ఎంత తింటే అంత పెట్టాలని, వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండాలని అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా జామి మండలం కుమరాం కెజిబివి పాఠశాలలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని,బరువు పెరిగి బలంగా ఉండాలని, అప్పుడే వ్యాధులను తట్టుకునే శక్తి కలుగుతుందని అన్నారు. ప్రతి 6నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రలు మింగాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి రెగ్యులర్ తనిఖీలు జరగాలని ఎఎన్‌ఎంకు సూచించారు. ఈ సందర్భంగా పిల్లలు వ్యాధుల పై అవగాహన కలిగేలా ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకుంది. కలెక్టర్ వారిని అభినందించారు. దగ్గరే ఉండి వారితోనే మాత్రలు మింగించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, డిఇఒ ప్రేమ్‌కుమార్, బాలల ఆరోగ్య సురక్ష డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ జయశ్రీ, ప్రిన్సిపాల్ బి.జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేత


ప్రజాశక్తి-వీజయనగరం కోట

పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0పథకాన్ని ప్రధాని నరేంద్రమోడీ మంగళవారం ప్రారంభించారు. పట్టణ ప్రాంత పేదల కోసం పిఎంఎవై అర్బన్, గ్రామీణ ప్రాంతాల కోసం పిఎంఎవై గ్రామీణ్ పథకాలను ప్రవేశపెట్టారు. లబ్దిదారులకు ఇళ్లు పంపిణీ చేశారు. ఒడిషా రాష్ట్రంలో అత్యంత వేడుకగా జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. పిఎంఎవై ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తిలకించారు. పిఎంఎవై గ్రామీణ్ పథకం కింద దుప్పాడకు చెందిన టి.రామయ్యమ్మ, మజ్జి ఈశ్వరమ్మ, యెజ్జిపురపు రాజేశ్వరి, పిఎంఎవై అర్బన్ పథకం కింద విజయనగరం కొండకరకాం లేఅవుట్‌లో ముద్దాడ లత, విజయనగరం పట్టణంలో రఘుపాత్రుని శశికళ, రాజాన చంద్రకళ ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేయగా, వారికి ఇళ్ల తాళాలను అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, మెప్మా పిడి సుధాకరరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణ్, టిడ్కో ఇఇ జ్యోతి, ఇతర అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

డిఎస్‌పి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం సబ్ డివిజన్ డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన ఎం.శ్రీని వాసరావు మంగళ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లా డుతూ శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతంగా కలగకుండా చర్యలు చేపట్టాలని, గంజాయి నియంత్రణకు ఆకస్మికంగా డైనమిక్ వాహన తనిఖీలు నిర్వహించాలని, మాదక ద్రవ్యాలకు యువత ఆకర్షితులు కాకుండా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులను చైతన్యపర్చి, వాటికి దూరంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డిఎస్‌పికి సూచించారు.



ఎస్‌పికి పుష్పగుచ్చం అందజేస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



వినతినిస్తున్న కౌలు రైతులు, నాయకులు

మెంటాడ: కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. మండలంలోని ఆగూరు సచివాలయం ఎదుట కౌలు రైతులు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలో కౌలుకు రైతులు వివిధ రకాల పంటలను పండిస్తూ జీవనం సాగిస్తున్నారని రైతులకు అన్నదాత పెట్టుబడి సాయం 20వేల రూపాయలు అందించాలని, సమగ్ర ఉచిత భీమా సౌకర్యం కల్పించి, గతేడాది తుపాను, కరువు తాకిడికి నష్టపోయిన రైతులకు భీమా పరిహారంతోపాటు రెండు లక్షలు వరకు రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ కార్యదర్శికు అందజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బోగి కృపారావు, తెంటి ముత్యాలనాయుడు, సిద్దల లక్ష్మీ, షేక్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వల్లే పాఠశాల నాశనం

చీపురుపల్లి: విద్యాధికారుల వల్లే పాఠశాల నాశనమైందని దేవరపొదిలాం సర్పంచ్, ఎంపిటిసిలు అధికారులను నిలదీశారు. మండల సర్వ సభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ సమీక్ష చేశారు. అయితే విద్యాశాఖకు సంబంధించి సమీక్ష చేస్తుండగా దేవరపొదిలాం, ఎంపిటిసి, సర్పంచ్‌లు తమ ప్రాంత విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై మండల విద్యాశాఖాధికారిని నిలదీశారు. పూర్తి స్థాయిలో విద్యార్థులున్నప్పటికీ దేవర పొదిలాంలో ఉన్న ఉన్నత పాఠశాలను ఎందుకు రద్దు చేయడానికి సిద్ధమయ్యారని ప్రశ్నించారు. ఒకే రోజు ఎక్కువ మంది విద్యార్థులకు టిసిలు ఇవ్వడానికి గల కారణాలేమిటని ఎంఇఒని నిలదీశారు. దీంతో ఎంపిపి, ఎంపిడిఒలు సర్పంచ్, ఎంపిటిసిలకు సర్ది చెప్పారు. అనంతరం సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషా, మండల ఉపాధ్యక్షులు కరిమజ్జి రమణమ్మ, తహశీల్దారు రాజారావు, ఎంపిటిసిలు, సర్పంచులు, పాల్గొన్నారు.

ఆయిల్ షాపులపై విజిలెన్స్ దాడులు

శృంగవరపుకోట: పట్టణంలోని ఆయిల్ షాపులపై తూనికలు కొలతలు, ఆహార భద్రత శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి నాగుల్, తూనికలు, కొలతల విజిలెన్స్ అధికారి బి.సింహాచలం మాట్లాడుతూ శ్రీ విజయ్‌కృష్ణ ట్రేడర్స్ దుకాణం లైసెన్స్ ముగిసి సుమారు రెండు నెలలు కావస్తున్నా రెన్యువల్ చేయించుకుండా వ్యాపారం నిర్వహిస్తున్నందు వల్ల షాపు యజమాని కాపుగంటి రాజశేఖర్ పై కేసు నమోదు చేశామన్నారు. షాపులలో ఆయిల్ శాంపిల్స్ తీసుకున్నామన్నారు. లక్ష్మీనారాయణ ట్రేడర్స్ దుకాణంపై దాడులు నిర్వహించి అధిక రసాయనాలతో తయారు చేశారనే అనుమానంతో బెల్లపు దిమ్మలను, కొలతలు తేడాగా ఉన్నాయని లీటరు, రెండు, లీటర్లు ఐదు లీటర్ల రిఫండ్ ఆయిల్ బాటిల్లను స్వాధీనం చేసుకున్నామని వీటిని పరీక్షల నిమిత్తం హైదరాబాదులో గల ల్యాబ్‌కు పంపిస్తామని తెలిపారు. విజిలెన్స్ సిబ్బంది, విఆర్‌ఒలు కన్నయ్య, రమణ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమలను తెరిపించాలి

బొబ్బిలి రూరల్: ఉమ్మడి జిల్లాలో మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. భీమసింగి చక్కెర పరిశ్రమ ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని, లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెరిపించాలని కోరుతూ మంగళవారం రంగరాయపురం సచివాలయం వద్ద నిరసన తెలిపి కార్యదర్శికు వినతి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న చక్కెర పరిశ్రమలు మూత పడడంతో కార్మికులు రోడ్డును పడడంతో పాటు చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భీమసింగి చక్కెర పరిశ్రమను ఆధునీకరణ చేసి తెరిపించాలని, ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెరిపించి చెరకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి త్రినాధ, ఉడుముల ప్రసాద్, చెరకు రైతులు పాల్గొన్నారు.

ఈనెల 23తో ఇ- పంట నమోదు పూర్తి

బొండపల్లి: ఈ నెల 23వ తేదితో ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తి కానుందని ఎఒ పి.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని గరుడబిల్లిలో మంగళవారం ఈ పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఎవరైనా ఈ-పంట నమోదు చేసుకోలేక పోతే వెంటనే తమ ఆధార్ కార్డ్‌ను 1బితో అనుసంధానం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రానికి వచ్చి ఈ- పంట నమోదు చేసుకోవాలని, ఈ- పంట నమోదు చేసుకున్న వారు తమ నమోదు వివరాలను సరిచూసుకోవాలని చెప్పారు. తమ ఆధార్ కార్డు తీసుకొని వచ్చి వేలి ముద్ర వేసి ఈకేవైసి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు.

'వందే భారత్'కు బొబ్బిలిలో హాల్టు కల్పించాలి

బొబ్బిలి: దుర్గ్ నుంచి విశాఖకు నూతనంగా నడుస్తున్న వందే భారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ కల్పించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కోరారు. కేంద్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో రామ్మోహన్ నాయుడును జనసేన నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి రైల్వే స్టేషన్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుందని, రైల్వేకు అత్యధికంగా ఆదాయం వస్తుందని చెప్పారు. నిత్యం రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్లో వందే భారత్ రైలుకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తితో ఉన్నారని, హాల్టు కల్పించేలా చూడాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బొబ్బిలి: ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు పట్టణ సిఐ, మున్సిపల్ ఏఇ, ఆర్ అండ్ బి జెఇ, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను మంగళవారం పరిశీలించారు. ప్రమాదాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

30లీటర్ల నాటుసారా పట్టివేత

మెంటాడ: మండలంలో పిట్టాడ పంచాయతీ పరిధిలోని వణిజ గ్రామంలో మంగళవారం 30 లీటర్ల నాటుసారా పట్టుకున్నట్లు ఆండ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు. ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు.

హత్యకేసులో ఏడేళ్లు జైలు

డెంకాడ : 2020లో డెంకాడ పోలీసు స్టేషన్‌లో నమోదైన హత్యకేసులో నిందుతుడైన చింతలవలస గ్రామానికి చెందిన మోపాడ అప్పలనాయుడుకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు జడ్జి ఎన్ పద్మావతి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు భోగాపురం సర్కిల్ సిఐ రామకృష్ణ తెలిపారు. చింతలవలస ఎస్‌సి కాలనీకి చెందిన మోపాడ అప్పల నాయుడు, మోపాడ శాంతి భార్యభర్తలకు అదే గ్రామానికి చెందిన గురజాపు శ్రీను అనే వ్యక్తికి మధ్య ఇంటి స్థలం విషయమై 2020 జనవరిలో గొడవ జరిగింది. ఈ సమయంలో గురజాపు శ్రీను వదిన పోలిపల్లి ఉమా తన మరిదిని ఎందుకు కొడుతున్నారని అడ్డుకునేందుకు అక్కడికి వచ్చింది. ఈ నేపథ్యంలో మోపాడ అప్పల నాయుడు, అతని భార్య కలిసి పోలిపల్లి ఉమను కొట్టి నెట్టివేశారు. దీంతో కిందపడిపోయిన ఉమ తలకు బలమైన గాయమై చనిపోయింది. ఈ కేసులో ముద్దాయి మోపాడ అప్పలనాయుడుకు పై విధంగా జైలు శిక్ష విధించినట్లు సిఐ తెలిపారు.

పరిశుభ్రతతోనే నులి పురుగులు దూరం

ప్రజాశక్తి-చీపురుపల్లి

నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు దివ్య ఔషధంలా పని చేస్తాయని ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల, కర్లాం పిహెచ్‌సి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణరాజుతో కలిసి పాల్గొని మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగగిరి సుధారాణి, రామలింగాపురం సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ, కర్లా సిహెచ్‌సి బి.కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: నులిపురుగుల నివారణతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి దిలీప్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్‌పి హైస్కూల్లో సిబ్బందితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నాయుడు వలస స్కూల్లో సర్పంచ్ నడిమింటి లక్ష్మి ఆధ్వర్యంలో మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు, ఎంఎల్‌హెచ్‌పి యోగిత, ఉపాధ్యాయులు బొప్పే రవి, తాన్న కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చీపురుపల్లి: విద్యార్థికి మాత్రలు వేస్తున్న ఎంపిపి వెంకటనర్సమ్మ

బొండపల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిపి చల్ల చలంనాయుడు విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బండారు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కోల రమణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ఎ బాషా, పిహెచ్ఎస్ఎన్ రోజా రమణి, ప్రధానోపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామంలో అంగనవాడి సెంటర్స్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సిడిపిఒ ఉమా, అంగన్వాడి టీచర్స్ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. కొట్టం పిహెచ్‌సి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలు కళాశాలలలో సిహెచ్ఒ తారకరావు వైద్య సిబ్బంది మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు.

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు, ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 25 వరకు అంగన్వాడి కేంద్రాల్లోనూ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తారని ఎంఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: విద్యార్థికి మాత్ర వేస్తున్న ఎంఇఒ బాలభాస్కరరావు

డెంకాడ: నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల ఉండదని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్.అచ్చితకుమారి తెలిపారు. మండలంలోని అక్కివరం ఎపి మోడల్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్ రత్నకుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఎస్ గురుభక్తులు, పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

బాడంగి : పరిశుభ్రతతో నులుపురుగులు దూరం చేయవచ్చు అని ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో జాతీయ నులు పురుగుల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సిబిఎం బాలికొన్నత పాఠశాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. పాఠశాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ పై సమగ్ర దర్యాప్తు చేసి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిబిఎం పాఠశాల స్థలం రూ.100కోట్లు విలువ చేసినప్పటికీ స్థల మార్పిడి కింద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం దుర్మార్గమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అవినీతికి పాల్పడి పాఠశాల స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అక్రమ రిజిస్ట్రేషన్ పై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రాన్ని అందించారు. స్థలం రిజిస్ట్రేషన్ పై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ సాయిశ్రీ హామీ ఇచ్చారు.

సిబిఎం బాలికొన్నత పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వారిపైన, చేసుకున్న వారిపైన క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు.


ఆర్‌డిఒకు వినతి పత్రాన్నిస్తున్న నాయకులు

తాగు, సాగు నీటి సౌకర్యాలకు కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నియోజక వర్గంలో తాగు, సాగునీటి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, పరిపాలన తీరు నచ్చి పలువురు జన సేనలో చేరడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నారని చెప్పారు. నియోజక వర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు లోకం ప్రసాద్, కాకర్ల పూడి శ్రీనివాసరాజు, నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, శంకర రావు, బంగారు భాను ప్రకాష్, అంబళ్ల అప్పలనాయుడు, జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చుంనాయుడు, నగర పంచాయతీ జనసేన నాయకులు నల్లి చంద్ర శేఖర్, ఎంఎం నాయుడు, మద్దిల అప్పన్న, తుమ్ము వెంకట రమణ, రవ్వా నాని, గదల అచ్చుం నాయుడు, పాల్గొన్నారు.


చనమల్ల వెంకటరమణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాధవి

వాటర్ గ్రీజర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగదీష్ బాబు సహకారంతో గర్భిణులు, చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన రూ. 60వేలు విలువ కలిగిన రెండు హాట్ వాటర్ గీజర్స్‌ను స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన జనరల్ మీటింగ్‌లో భాగంగా పర్యటించినప్పుడు గర్భిణులు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని వాటిని పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలో భాగంగా గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన గ్రీజర్స్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, నాయకులు రెడ్డి వెంకన్న, మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు, కాపుగంటి వాసు, చక్కా కిరణ్, అనకాపల్లి చెల్లయ్య, వాకాడ బాలు తదితరులు పాల్గొన్నారు.


నిత్యవసరాలను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వరద బాధితులకు నిత్యవసరాలు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

విజయవాడలోని వరద బాధితులకు సవరవల్లి గ్రామానికి చెందిన జీసస్ మైటి వారియర్స్ మినిస్ట్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ అధినేత పి గణపతి సుమారు రెండు లక్షల విలువైన వస్తువులను అందజేశారు. విజయవాడ, పిఠాపురం, గొల్లప్రోలు, వైఎస్ఆర్ కాలనీ, ఎస్‌సిపేట పలు ప్రాంతాలలో వరద బాధితులకు ఈ నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. సుమారు 200 మంది కుటుంబాలకు అందజేసినట్లు గణపతి తెలిపారు.

మాదక ద్రవ్యాలకు కేరాఫ్ వసతి గృహం

● బాలుర హాస్టల్‌లో కాల్చి పడేసిన సిగరెట్, ఖైనీ గుట్కా ప్యాకెట్లు ● అపరిశుభ్రంగా స్నానపు గదులు ● పగిలిన కిటికీలు

ప్రజాశక్తి - గజపతినగరం

స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం మాదక ద్రవ్యాలకు అడ్డాగా మారింది. మండల కేంద్రంలో నెలకు రూ. 25వేలు అద్దె చెల్లిస్తూ అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ వసతి గృహంలో అసౌకర్యాలతో కొట్టిమిట్టాడుతోంది. ముఖ్యంగా ఇక్కడ బాలురు చాలా మంది చెడు వ్యసనాలకు బానిసలువుతున్నారని పరిసరాలను చూస్తూనే అర్థమవుతోంది. వసతి గృహంలో కాల్చి పడేసిన సిగరెట్ పీకలు, ఖైనీ, గుట్కా ప్యాకెట్లు వంటివి లభ్యమవడం ఆందోళన కలిగిస్తోంది.

వసతి గృహం పరిసర ప్రాంతాలలో ఎటు చూసినా కుప్పల కుప్పలుగా పేరుకుపోయిన వాడిపడేసిన సిగరెట్, గుట్కా, ఖైనీ, అగ్గిపెట్టెలు, గుట్కా ఉమ్ములతో నిండిన గోడలు దర్శనమిస్తున్నాయి. ఒక పక్క ప్రభుత్వం, పోలీస్ శాఖ గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం పట్ల అవగాహన కల్పిస్తున్నప్పటికీ వసతి గృహం విద్యార్థుల్లో మార్పు లేకపోవడానికి కారణం అధికారుల నిర్లక్ష్యంగానే స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఈ వసతి గృహంలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. పగిలిన కిటికీలు, అడుగేస్తే జారిపోతాం అన్నంతలా మలమూత్రాలతో మరకలు కట్టిన, నాచు కట్టిన స్నానపు గదులు, మురుగుతో కూడిన మరుగుదొడ్లు ఇలా అత్యంత దీన స్థితిలో వసతి గృహం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతి గృహంలో సౌకర్యాలు కల్పించడంతో పాటు మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న విద్యార్థులను మంచి మార్గంలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అధ్వానంగా మరుగుదొడ్డి


నాచు పట్టేసిన స్నానపు గది

సిఎం సహాయ నిధికి విరాళాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపుతో సీఎం సహాయ నిధికి విరాళాలు చేరుతున్నాయి. మంగళవారం మండలంలోని మెట్టవలస టిడిపి నాయకులు రూ.70వేలు, పెంట నాయకులు రూ.42,100, దంత వైద్యులు అశోక్, పశువైద్యులు దీనకుమార్ రూ.10వేలు, గొంగడవలస గ్రామ నాయకులు రూ.10వేలు, వెలగవలస నాయకులు రూ.10వేలు, తాపీమేస్త్రీ యూనియన్ రూ.10వేలు, బాడంగి మండలం పినపెంకి టిడిపి నాయకులు రూ.60వేలు, ఆనవరం నాయకులు 32వేలు, పెద్దపల్లికి చెందిన ఆవు సత్యనారాయణ రూ.20వేలు, వాడాడ సర్పంచ్ రూ.15వేలు, వైస్ ఎంపిపి ఎస్.భాస్కరరావు రూ.10వేలు, లచ్చయ్యపేట నాయకులు రూ.10వేలు, రామభద్రపురం మండలం కొట్టక్కి టిడిపి నాయకులు రూ.50వేలు, కొట్టక్కి గ్రామానికి చెందిన మెకానిక్ రూ.5వేలు, ఎస్.సీతారాంపురం మాజీ సర్పంచ్ కె.తిరుపతి రూ.10వేలు, తెర్లాం మండలంలోని అప్పలంపేట నాయకులు రూ.20,100, ఉద్దవోలు గ్రామానికి చెందిన అల్లు సత్యం రూ.10వేలు, పెరుమాళి గ్రామానికి చెందిన గణపతి రూ.10,116, విజయనగరానికి చెందిన వి.సంతోషి రూ.1000 విరాళాలను బేబినాయనకు అందజేశారు.

సిఎం సహాయ నిధికి ఒకనెల గౌరవ వేతనం వితరణ

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఒకనెల గౌరవ వేతనాన్ని మున్సిపల్ కో అప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మికు గౌరవ వేతనం రూ.2500 అందజేశారు. మానవత్వంతో వరద బాధితులను ఆదుకోవాలని ఖాన్ కోరారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విశాఖకు చెందిన ప్రముఖ మోటివేటర్ రేవంత్ కనకమ్ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ మానసిక ప్రవర్తన, పాజిటివ్ అటిట్యూడ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలు విజయానికి కావలసిన సోపానాలని చెప్పారు. కష్టంగా భావిస్తే ఏదీ సాధించలేమని ఇష్టంగా ముందుకు సాగితే ఏదీ అసాధ్యం కాదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి మౌలిక పరీక్షలు, గ్రూప్ డిస్కషన్స్‌ల్లో విజయం సాధించడానికి తగు సూచనలు, సలహాలను విద్యార్థులకు లఘు చిత్రాల ద్వారా చూపించారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం, నూతన ఆవిష్కరణలుపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, ప్రజెంటేషన్ స్కిల్స్, పబ్లిక్‌లో మాట్లాడటం, లీడర్‌షిప్, వృత్తి నైపుణ్యాలు, కాన్ఫిడెన్స్ బిల్డింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారాని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు..

జిల్లా వ్యాప్తంగా మంగళవారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మండల కేంద్రాల్లో ర్యాలీలు, మొక్కలు నాటడం, పరిశుభ్రతపై అవగాహన, ప్రతిజ్ఞలు చేయించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యేలు కోళ్లలలితకుమారి, నాగమాధవి, కోండ్రు మురళీ మోహన్ పిలుపు నిచ్చారు.

ప్రజాశక్తి- యంత్రాంగం


డెంకాడ: ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే, టిడిపి నాయకులు


ఎస్‌కోట : ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల, అధికారులు, నాయకులు



కొత్తవలస: ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, అధికారులు



నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న అధికారులు, నాయకులు


తెర్లాం : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


రాజాం : రోడ్డును క్లీన్ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు, కార్మికులు